
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
ఆదివారం 25 ఆగస్టు 2024



లారీకి రూ.20 వేల నుంచి రూ.30 వేలు..

లుకలాంలో లారీ యాజమానుల నుంచి.. ఒక్కో లారీకి రూ.20వేల నుంచి రూ.30వేలు వరకు, ట్రాక్టర్‌కు రూ.4వేలు చొప్పున ముఠా సభ్యులు వసూలు చేస్తున్నారు. వాటిలో లారీకి రూ.2వేలు, ట్రాక్టర్‌కు రూ.వెయ్యి చొప్పున రెవెన్యూ, సచివాలయం, పర్యవేక్షణ అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నారు. ముఠా సభ్యుల్లో వైసీపీ కీలక నాయకుడితో పాటు టీడీపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఇలా నదీతీర గ్రామాల్లో రోజుకు రూ.10లక్షల నుంచి రూ.15లక్షల వరకు ఇసుక వ్యాపారాలను సాగిస్తున్నారు.

- కొందరు తెలుగుతమ్ముళ్ల ఇసుక అక్రమ తవ్వకాలు
- వెనుక ఉండి నడిపిస్తున్న వైసీపీ నాయకులు
- పగలు డంపింగ్ చేసి రాత్రి లోడింగ్
- లారీ రూ.30 వేలు.. ట్రాక్టర్ అయితే రూ. 4వేలు
- లుకలాం కేంద్రం నుంచి అక్రమ రవాణా
- తెలిసినా పట్టని సచివాలయాల సిబ్బంది
- అంబాజీపేటలో పాఠశాల ఆవరణలో నిల్వలు

మొన్నటి వరకూ వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు ఇసుక అక్రమాలు యథేచ్ఛగా సాగించారు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చింది. కాగా.. ఇసుక అక్రమాలకు అలవాటు పడిన వైసీపీ నాయకులు.. ప్రస్తుతం టీడీపీ శ్రేణులతో చేతులు కలిపారు. రెండు పార్టీల నేతలూ ఒక్కటై.. నరసన్నపేట నియోజకవర్గం పరిధిలోని వంశధార నదిలో ఇసుకను తోడేస్తున్నారు. మరోవైపు అధికారులతో కుమ్మక్కై యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా కొనసాగిస్తున్నారు.

ఒక్కటై.. తోడేస్తున్నారు..!



● నరసన్నపేట మండలం అంబాజీపేట పాఠశాల ముందు భాగంలో భారీస్థాయిలో ఇసుకను డంపింగ్ చేశారు. విద్యార్థులు ఆడుకునేందుకు కూడా అవకాశం లేకుండా ఇసుక డంపింగ్ చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. అలాగే బుచ్చిపేట, చేనులవలస గ్రామాల్లోని తోటల్లో వాహనాలు ఉంచి.. రాత్రి సమయంలో ఇసుక తవ్వకాలు చేస్తూ రవాణా సాగిస్తున్నారు.



వీఆర్వో, వీఆర్‌ఏలతో కుమ్మక్కు..

● నరసన్నపేట మండలం లుకలాం గ్రామంలో ఎక్కడ చూసినా ఇసుక నిల్వలే దర్శనమిస్తున్నాయి. ఆర్‌బీకే, ఆరోగ్య కేంద్రానికి మధ్య భాగంలో ఇసుకను డంపింగ్ చేశారు. వంశధార నదికి వెళ్లే మార్గంలోని కళ్లాల్లోనూ ఇసుక పోగులు వేశారు. రాత్రి సమయాల్లో లారీలను డంపింగ్ కేంద్రానికి తీసుకువచ్చి.. ఇసుక లోడింగ్ చేసి తరలిస్తున్నారు.



(నరసన్నపేట)

నరసన్నపేట నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు.. వైసీపీ నాయకులు ఒక్కటై యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. వంశధార నదిలో ఇసుకను తవ్వి.. విశాఖపట్నం, పలాస తదితర ప్రాంతాలకు లారీల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారు. అక్రమాల వ్యవహారంలో వైసీపీ నేతలు వెనుక ఉండి.. తెలుగు తమ్ముళ్లను ముందుకు నడిపిస్తున్నారు. నరసన్నపేట మండలం బుచ్చిపేట, చేనులవలస, అంబాజీపేట, లుకలాం గ్రామాల్లో జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. అలాగే శ్రీకాకుళం, జలుమూరు మండలాల్లోని కరజాడ, బైరి, రోణంకి, పొన్నాం తదితర ర్యాంపుల్లోనూ భారీగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు.

నరసన్నపేట మండలం లుకలాం కేంద్రంగా పది రోజుల నుంచీ భారీగా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఆమదాలవలస-నరసన్నపేట మండలాలను అనుసంధానం చేసే రైల్వే వంతెనకు సమీపంలో పగలు ఇసుకను తోడేసి.. లుకలాంలోని ఒక టీడీపీ నాయకుడి స్థలంలో డంపింగ్ చేస్తున్నారు. లుకలాంలో రోజూ పదుల సంఖ్యలో ట్రాక్టర్లు.. నదిలో నుంచి ఇసుకను డంపింగ్ ప్రాంతానికి తీసుకువస్తున్నాయి. రాత్రి 8గంటల సమయంలో ఈ ఇసుకను లారీలకు లోడింగ్ చేపట్టి.. పాలకొండపేట, చేనులవలస, మడపాం మీదుగా హైవేకు చేరుకుంటున్నారు. మరికొన్ని లారీలను ఉర్లాం మీదుగా కోమర్తి జంక్షన్‌కు తీసుకువచ్చి హైవేకు చేరుకుంటున్నారు. రోజుకు సుమారు 30 లారీల్లో ఇసుక లోడింగ్ చేసి తరలిస్తున్నారు. లుకలాం, పాలకొండపేట, డోలపేట, అంబాజీపేట గ్రామాలకు చెందిన ట్రాక్టర్లు రాత్రి సమయంలో నరసన్నపేట, టెక్కలి పరిసర ప్రాంతాలకు ఇసుకను రవాణా చేస్తున్నారు.



లోడింగ్‌కు వచ్చి.. గ్రామ శివారున ఉన్న లారీలు

అక్రమాలను ఉపేక్షించం

నరసన్నపేట మండలంలోని నదితీర గ్రామాల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులతో పర్యవేక్షణ కమిటీలు వేశాం. ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించం. సంబంధిత వీఆర్వోలపై చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

-సత్యనారాయణ, తహసీల్దార్, నరసన్నపేట

నది తీర గ్రామాల నుంచి పిడికెడు ఇసుక కూడా అక్రమ రవాణా చేయకూడదని ప్రభుత్వం.. వీఆర్వోలు, వీఆర్‌ఏలు, పోలీసులతో మానటరింగ్ కమిటీలను ఏర్పాటు చేసింది. ఇద్దరు, ముగ్గురు వీఆర్వోలు బృందంగా ఏర్పడి రాత్రివేళ పర్యవేక్షించాలి. కాగా.. ఇసుక అక్రమ రవాణా ముఠాలో కొందరు వీఆర్వోలు, వీఆర్‌ఏలే కీలకపాత్ర షోషిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. ఉన్నతాధికారులు ఈ సభ్యులకే అలర్ట్ చేస్తారు. ఈ క్రమంలో వీరు ఇసుక అక్రమ దందాదారులు ముందుగా సమచారం ఇచ్చి.. ఎక్కడా వాహనాలు పట్టుబడకుండా ఉండేలా సహకరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు గ్రామాల్లో ఎక్కడికక్కడ ఇసుక నిల్వలు భారీగా కనిపిస్తున్నా పట్టించుకోవడం లేదంటే.. ఈ దందాలో రెవెన్యూ సచివాలయ అధికారుల పాత్ర ఎంత ఉందో ఇట్టే అర్థమవుతోంది.

పైపైన మట్టి కప్పి..

నరసన్నపేట మండలంలో నదీ తీర గ్రామాల నుంచి కొంతమంది ట్రాక్టర్లు, టిప్పర్లకు బాడీ సమాంతరంగా ఇసుకను లోడింగ్ చేస్తున్నారు. దానిపై భాగంలో పనికిరాని ఇసుకమట్టి వేసి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. శనివారం లుకలాం నుంచి నరసన్నపేట వైపు వస్తున్న ఓ ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్‌ను ప్రశ్నించగా.. మట్టి అని బుకాయించాడు. వారు అనుమానంతో ట్రాక్టర్‌లోపల కింది భాగంలో పరిశీలించగా ఇసుక ఉన్నట్టు గుర్తించారు. ఆ ట్రాక్టర్‌ను నరసన్నపేట కార్యాలయానికి తరలించారు. ఈ మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేశామని తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు.



ట్రాక్టర్‌లో ఇసుక పై భాగాన మట్టి కప్పి తరలిస్తున్న దృశ్యం

రోగులపై ఆర్థిక భారం వద్దు

- మెరుగైన వైద్యసేవలందించాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 24: ఎన్టీఆర్ వైద్యసేవల కింద రోగులపై ఆర్థిక భారం వేస్తే కఠినచర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలను హెచ్చరించారు. శనివారం కలెక్టరేట్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'రోగులపై ఆర్థికభారం వేయకుండా మెరుగైన వైద్యం అందించాలి. ఆరోగ్యమిత్రలు బాధ్యత వహించాలి. రోగులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సమావేశం రోజున వారిని పిలవాలి. ఇబ్బందులు లేకుండా నాణ్యమైన సేవలు అందించాలి' అని సూచించారు. ఎన్టీఆర్ వైద్యసేవల కోఆర్డినేటర్ ప్రకాశరావు మాట్లాడుతూ 'ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలకు సంబంధించిన ధరలను బోర్డుపై ప్రదర్శించాలి. రోగుల నుంచి ఎటువంటి నగదు వసూళ్లు చేయరాదు. ఆస్పత్రులకు వచ్చే రోగులకు అక్కడ ఆ సేవలు అందుబాటులో లేకపోతే.. ఎక్కడ లభిస్తాయో వివరించాలి. మెనూలో భోజనంతోపాటు పాలు, పండ్లు ఉండేలా చూడాలి. 108 అంబులెన్స్ సేవలను పక్కాగా వినియోగించాలి' అని తెలిపారు. వివిధ ఆస్పత్రులపై వచ్చిన ఫిర్యాదులను ఆయన కలెక్టర్‌కు వివరించారు. సమావేశంలో డీసీహెచ్‌వో రాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీకాంత్, కార్పొరేట్ ఆస్పత్రుల ప్రతినిధులు ప్రవీణ్ కుమార్ (జెమ్స్), సోమేశ్వరరావు(కిమ్స్), శివకుమార్(మెడీకవర్),తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి

కలెక్టరేట్, ఆగస్టు 24: జిల్లాలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేయాలి. కార్మికులు, సిబ్బంది సురక్షితంగా ఉండేలా చర్యలు తీసుకోవాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాలోని భారీ, మధ్యతరహా పరిశ్రమల ప్రతినిధులతో నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పరిశ్రమల్లో కార్మికులు పాటించాల్సిన భద్రత నియమాలపై రానున్న రెండు వారాలు సంపూర్ణ శిక్షణ ఇవ్వాలి. పారిశ్రామిక యూనిట్లలో రసాయన ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు చేపట్టాలి. అమ్మోనియా, క్లోరిన్, ఎల్పీజీ, బ్యుటెన్ వంటి మండే స్వభావం గల వాయువులను పెద్ద పరిమాణంలో వినియోగించే పరిశ్రమల్లో కట్టుదిట్టమైన భద్రతా ప్రమాణాలు ఉండాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలి. భద్రతా ప్రమాణాల్లో నిర్లక్ష్యం కారణంగా ఇటీవల పలు పరిశ్రమల్లో భారీ ప్రమాదాలు జరిగాయి. అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను సమర్థంగా నిర్వహించాలి. అత్యవసర సమయాల్లో వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలి' అని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పరిశ్రమల మేనేజర్ ఉమామహేశ్వరరావు, ఏడీ రమణారావు, అగ్నిమాపక అధికారి మోహనరావు, పర్యావరణశాఖ ఇంజనీర్ రామారావునాయుడు, రెడ్డీస్ ల్యాబొరేటరీస్, యునైటెడ్ బ్రెవరీస్, నాగార్జున అగ్రికెమ్, అరబిందో ఫార్మా, ఆంధ్రా అర్గానిక్స్, స్మార్ట్‌కెమ్ టెక్నాలజీ, విశాఖ డెయిరీ, సరాఖ లేబ్, తదితర పరిశ్రమల ప్రతినిధులు హాజరయ్యారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పక్కన ఎస్పీ, జేసీ

కాలువపై వంతెన.. అక్రమ నిర్మాణమే

- నిర్ధారించిన రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంతబొమ్మాళి, ఆగస్టు 24: సంతబొమ్మాళిలో ఓ రియల్‌ఎస్టేట్ లే-అవుట్ రహదారి కోసం వంశధార కాలువపై కట్టిన వంతెన అక్రమమేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించారు. సంతబొమ్మాళి పంచాయతీ రెయ్యపేట వద్ద సాగునీటి కాలువపై అనధికార వంతెన నిర్మాణంపై ఈ నెల 6న 'రియల్ దందా' పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. ఇప్పటికే నరసన్నపేట వంశధార జేఈలు సింహాచలం, శోభనబాబులు వంతెన నిర్మాణాన్ని పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఆ వంతెన నిర్మాణం ఉందో.. లేదో సర్వే చేసి నిర్ధారించాలని తహసీల్దార్‌కు వంశధార ఏఈ సింహాచలం లేఖ రాశారు. ఈ మేరకు తాజాగా శనివారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసన్న, వీఆర్వో రమేష్, సర్వేయర్ రవి, వంశధార ఏఈ సింహాచలం అక్కడకు వెళ్లి పరిశీలించారు. 191-1 సర్వే నెంబర్ వేసిన లే-అవుట్‌కు పక్కనే వంశధార కాలువపైనే అనధికార వంతెన నిర్మించినట్టు రెవెన్యూ అధికారులు తేల్చారు. కాగా.. అనుమతులు లేకుండా రియల్ దందా సాగిస్తూ.. సాగునీటి కాలువ మీద అనధికార వంతెన నిర్మించడంతో పంట పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సంతబొమ్మాళి, టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన వరదనీరు దేశీయగెడ్డ ద్వారా ఈ కాలువ గుండా కాకరాపల్లి తంపరకు చేరి సముద్రంలో కలుస్తుంది. అటువంటి కాలువపై అనధికార వంతెన నిర్మించడం వల్ల ముంపు ముప్పు తప్పదని రైతులు వాపోతున్నారు. చిన్నపాటి వర్షానికి ఆ కాలువ పొంగి రెయ్యపేట నుంచి సంతబొమ్మాళి పాలేశ్వర స్వామి ఆలయం వరకు డీపీఎన్ రోడ్డుపై నీరు చేరి రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పేర్కొంటున్నారు. తక్షణమే ఈ వంతెన తొలగించాలని కోరుతున్నారు. దీనిపై వంశధార ఏఈ సింహాచలం వద్ద ప్రస్తావించగా.. అనధికార వంతెన తొలగించాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు.



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు



సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిసిన సీవీఓ రామకృష్ణ ప్రసాద్

ఈపీడీసీఎల్ సీవీఓగా రామకృష్ణప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్‌గా నియమితులైన కె.రామకృష్ణప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రామకృష్ణప్రసాద్ మాట్లాడుతూ, సంస్థ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగం, విశాఖపట్నం, తూర్పు, పశ్చిమ గోదావరి సర్కిళ్ల వినియోగదారులు దీర్ఘకాలకంగా పరిష్కారం కాని విద్యుత్ సంబంధిత ఫిర్యాదులు, విద్యుత్ చౌర్యానికి సంబంధించిన ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబరు 1912కి తెలియజేయాలని కోరారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 24: వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటకు చెందిన మత్స్యకారుడు సూరాడ అప్పలస్వామి(61) చేపల వేటకు వెళ్లి మృతి చెందాడు. ఏఎస్ఐ జున్నారావు తెలిపిన వివరాల మేరకు.. అప్పలస్వామి శుక్రవారం రాత్రి చేపలవేటకు వెళ్లి తిరిగి వచ్చి బోటును లంగరు వేస్తుండగా కుప్పకూలిపోయాడు. వెంటనే తోటి మత్స్యకారులు పరిశీలించగా అప్పటికే అప్పలస్వామి మృతి చెందినట్టు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య, ఇద్దరు పిల్లలు ఘటనా స్థలానికి చేరుకుని విలపించారు. వజ్రపుకొత్తూరు ఏఎస్ఐ జున్నారావు శనివారం ఆ గ్రామానికి వెళ్లి అప్పలస్వామి మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



దున్నూరులో సంచరిస్తున్న ఎలుగుబంటి

ఉద్దానంలో ఎలుగు

ఉద్దానం ప్రాంతంలోని మందస మండలం దున్నూరు, గెడ్డూరు తదితర గ్రామాల రోడ్లపై శనివారం ఉదయం ఎలుగుబంటి సంచరించడంతో ప్రజలు భయాందోళన చెందారు. వారం రోజులు కిందట రాత్రి సమయంలో మూడు తల్లీ పిల్లల ఎలుగులు.. పితాలి, తోటూరు, చిన్నలోహరిబంద గ్రామాల పరిసరాల్లో మకాం వేసి వీరంగం సృష్టించాయి. ఏడాది కిందట ఎర్రముక్కాం, దున్నూరు గ్రామాల్లో ఎలుగుబంట్లు దాడి చేయగా.. ఇద్దరు మృతి చెందారు. మరికొందరు గాయాలపాలయ్యారు. వజ్రపుకొత్తూరు మండలంలో కూడా ఎప్పటికప్పుడు ఎలుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీంతో ఉద్దానం ప్రాంతం ప్రజలు రాత్రి ఆరు దాటితే చాలు ఇంటి నుంచి బయటకు రావడానికి హడలిపోతున్నారు. పగలు కూడా తోటల్లో పనులు చేసేందుకు భయపడుతున్నారు. అటవీ అధికారులు స్పందించి ఎలుగుబంట్ల నుంచి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

- హరిపురం



అలుగును పట్టుకున్న అటవీశాఖ అధికారులు

అడ్డపనసలో అలుగు

సారవకోట మండలం నవర అడ్డపనసలో జనవాసాల్లోకి అలుగు ప్రవేశించింది. గ్రామానికి చెందిన పట్ట ఉమామహేశ్వరరావు ఫామ్‌హౌస్‌లో శనివారం ఉదయం అలుగు కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు అలుగును పట్టుకుని మాళువ రేంజరు పరిధిలోని కొండల్లో విడిచిపెట్టారు. ఈ అరుదైన అలుగును చూసేందుకు ప్రజలు ఎగబడ్డారు. కార్యక్రమంలో పాతపట్నం ఫారెస్టు రేంజ్ అధికారి ఆర్.రాజశేఖర్, సారవకోట ఫారెస్టు సెక్షన్ అధికారి ఎల్.ఈశ్వరరావు, బీట్ ఆఫీసర్లు డి.శివప్రసాద్, ఎం.అజయ్ పాల్గొన్నారు.

- జలుమూరు

ఏపీ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్



ఆంధ్రప్రదేశ్ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ కార్యాలయం- 'నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ స్కీమ్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు చదివే పేద విద్యార్థులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. రాత పరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రానికి 4087 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.

అర్హత: విద్యార్థులు ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు; వసతి సౌకర్యం లేని ఏపీ ఆదర్శ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతూ ఉండాలి. ఏడో తరగతిలో జనరల్ విద్యార్థులకు 55 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు ఉండాలి. ఎనిమిదో తరగతిలో కూడా ఇలాగే మార్కులు తెచ్చుకోవాలి. కుటుంబ వార్షికాదాయం రూ.3,50,000 మించకూడదు.

రాత పరీక్ష: ఇందులో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటిది మెంటల్ ఎబిలిటీ టెస్ట్(ఎంఏటీ), రెండోది స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్(ఎస్ఏటీ). ఒక్కో పార్ట్‌లో 90 చొప్పున మొత్తం 180 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఏడు, ఎనిమిది తరగతుల సిలబస్ ఆధారంగా సైన్సెస్, మేథమెటిక్స్, సోషల్ స్టడీస్ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 180. పరీక్ష సమయం మూడు గంటలు. ఈ పరీక్షలో అర్హత పొందాలంటే జనరల్ కేటగిరీ విద్యార్థులకు 40 శాతం మార్కులు; ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 32 శాతం మార్కులు రావాలి.

స్కాలర్‌షిప్: రాత పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులకు తొమ్మిది నుంచి ఇంటర్ పూర్తిచేసేవరకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ.12,000 ఇస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 6
- **రాత పరీక్ష తేదీ:** డిసెంబరు 8
- **వెబ్‌సైట్:** www.bse.ap.gov.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZbiB0SEలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

ఏపీ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఫీమేల్)/ ఏఎన్ఎం ట్రెయినింగ్

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం(సీహెచ్&ఎఫ్‌డబ్ల్యూ)- మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ-ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. కోర్సు వ్యవధి రెండేళ్లు. రాష్ట్రంలోని ప్రభుత్వ/ప్రైవేట్ కళాశాలల్లో మొత్తం 2,330 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లోని సీట్లన్నీ ఉచితమే. ప్రైవేట్ కళాశాలల్లో 60 శాతం సీట్లు ఉచితం కాగా మిగిలిన 40 శాతం సీట్లు మేనేజ్‌మెంట్ కోటాకు చెందుతాయి. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆసక్తిగల అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకుని పూర్తిగా నింపి నిర్దేశిత ధ్రువ పత్రాలు జతచేసి సంబంధిత జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో వ్యక్తిగతంగా గానీ/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా గానీ సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 30
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి:** అక్టోబరు 15
- **తరగతులు ప్రారంభం:** అక్టోబరు 21 నుంచి
- **వెబ్‌సైట్:** http://cfw.ap.nic.in

పీహెచ్‌డీ



జేఎన్‌టీయూ అనంతపురంలో..

అనంతపురంలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూఏ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఇండస్ట్రీ ఎగ్జిక్యూటివ్‌లు, రీసెర్చ్ ప్రొఫెషనల్స్, పబ్లిక్ రిప్రజెంటేటివ్‌లు దరఖాస్తు చేసుకోవచ్చు.

రీసెర్చ్ విభాగాలు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్, ఫుడ్ టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, ఫార్మసీ.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో ఎంఈ/ఎంటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు ఉండాలి. కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు; ప్రైవేట్ ఇండస్ట్రీల్లో ఎగ్జిక్యూటివ్ కేడర్లో కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

- **స్పీడ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 4
- **చిరునామా:** డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూ, అనంతపురం-515002
- **వెబ్‌సైట్:** www.jntua.ac.in

కర్నూలు ఐఐఐటీడీఎంలో..

కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్(ఐఐఐటీడీఎం)- విశ్వేశ్వరాయ ఫెలోషిప్ స్కీమ్ కింద ఫుల్ టైమ్ పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. అకడమిక్ మెరిట్ ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు రిటెన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ విభాగాలు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(సీఎస్ఈ), ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ), మెకానికల్ ఇంజనీరింగ్(ఎంఈ)

సైన్స్ విభాగాలు: ఫిజిక్స్, మేథమెటిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత మాస్టర్స్ డిగ్రీతో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు; కనీసం 7 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు; ఏదేని ఇంజనీరింగ్ కళాశాల నుంచి 75 శాతం మార్కులతో డిగ్రీ పూర్తిచేసి గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- సైన్స్ విభాగాలకు సంబంధిత మాస్టర్స్ డిగ్రీతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్/సీఎస్ఐఆర్ జేఆర్ఎఫ్/యూజీసీ జేఆర్ఎఫ్/నెట్/ఎన్‌బీహెచ్ఎం స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రథమ శ్రేణి మార్కులతో ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులు; ఐఐటీల నుంచి 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

ఫైనాన్షియల్ అసిస్టెన్స్: ఎంపికైన అభ్యర్థులకు విశ్వేశ్వరాయ ఫెలోషిప్ కింద మొదటి రెండేళ్లు నెలకు రూ.38,750; చివరి రెండేళ్లు నెలకు రూ.43,750 అందిస్తారు. కంటింజెన్సీ గ్రాంట్ కింద ఏడాదికి రూ.1,20,000 ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లకు అటెండ్ అయ్యే వారికి రూ.లక్షన్నర ఇస్తారు.

- **చివరి తేదీ:** సెప్టెంబరు 8
- **వెబ్‌సైట్:** iiitk.ac.in/


నవ్య | చిత్రజ్యోతి

నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి

● అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి

పవన్ కల్యాణ్, నాగబాబు, అల్లు అర్జున్ తరచూ చేస్తున్న వ్యాఖ్యలతో మెగా ఫ్యామిలీలో విభేదాలు ఉన్నాయంటూ కొన్నాళ్లుగా మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఇప్పటి దాకా మెగా, అల్లు కుటుంబాల నుంచి ఎవరూ నేరుగా పెదవి విప్పింది లేదు. కానీ ఇప్పుడు తొలిసారి అల్లు అర్జున్ మామ కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి ఈ విషయంపై స్పందించారు. ఓ మీడియా ఛానల్ నిర్వహించిన చర్చా కార్యక్రమంలో ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇప్పుడు హీరోలు స్మగ్లర్ల వేషాలు వేస్తున్నారు' అంటూ పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలు, 'స్నేహితుల కోసం ఎక్కడిదాకా అయినా వస్తాను' అంటూ అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆయన తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

● కల్యాణ్ గారు ఏ సందర్భంలో అలా మాట్లాడారో తెలియదు. ఆయన మాటవరసకు అలా అని ఉంటారు అని నేను అనుకుంటున్నాను. కానీ ప్రజల్లోకి తప్పుడు సందేశం పోతోంది. తర్వాతైనా ఆయన 'నా ఉద్దేశం ఇది' అని చెబితే బాగుండేది. ఆయనే స్వయంగా పూనుకొని సరిదిద్దితే బాగుండేదని నా అభిప్రాయం.



● ఎన్టీఆర్ నటుడిగా రావణుడు, దుర్యోధనుడి పాత్రలు పోషించారు. అంటే దానర్థం మొత్తం స్త్రీ జాతిని ఆయన కించపరిచాడని కాదు కదా. ఆ తర్వాత ఆయన ముఖ్యమంత్రి కూడా అయ్యారు. పవన్ కల్యాణ్ కూడా నటుడిగా ఉండి రాజకీయ నాయకుడయ్యారు. సినిమా యాక్టర్‌ను యాక్టర్‌గానే చూడాలి. వారి వ్యక్తిత్వాలకు ఆ పాత్రల స్వభావాన్ని అంటగట్టే ప్రయత్నం చేయకూడదు. అల్లు అర్జున్ నిజంగా స్మగ్లింగ్ చేస్తే తప్పు పట్టాలి.

● అల్లు అర్జున్‌కు జాతీయ ఉత్తమ నటుడి అవార్డ్ వచ్చింది. 69 ఏళ్లలో ఎవరికీ రాని అవార్డ్ ఆయన్ను వరించింది. ఆయన మిత్రపక్షం బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఎన్డీయే ప్రభుత్వమే అర్జున్‌కు ఉత్తమ నటుడు అవార్డ్ ఇచ్చింది. అది పవన్ కల్యాణ్‌కు తెలియదా? మంచీ చెడూ చూడకుండానే భారత ప్రభుత్వం ఆ పురస్కారాన్ని ఇవ్వలేదు కదా?. ఆయన అభిమానులేమో అల్లు అర్జున్‌నే అన్నాడు అని అనుకుంటున్నారు. ఇప్పుడు ఈ వివాదానికి శుభంకార్డు పడాలంటే 'ఇది నేను జనరల్‌గా అన్నాను' అని పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేయాలి. లేదంటే ఆయన భాగస్వామిగా ఉన్న ఎన్డీయే ప్రభుత్వాన్ని తప్పు పట్టినట్లే. భారత ప్రభుత్వ నిర్ణయాన్ని వివాదాస్పదం చేస్తున్నట్లుగానే భావించాలి. చిరంజీవి గారు పవన్ కల్యాణ్, అల్లు అర్జున్‌తో మాట్లాడి ఈ వివాదానికి ముగింపు పలకాలి.



బ్రదర్.. తప్పకరావాలి!

కమర్షియల్ తెలుగు సినిమాకు ఒక ఊపుని తెచ్చి, బాక్సాఫీసు దగ్గర సునామీ సృష్టించిన హీరోలు మెగాస్టార్ చిరంజీవి, నందమూరి బాలకృష్ణ. వయసుతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేస్తూ కుర్ర హీరోలకు గట్టి పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు. ఎన్నోసార్లు బాక్సాఫీసు దగ్గర వీరిరువురి చిత్రాలూ పోటీ పడినప్పటికీ ఎటువంటి పొరపొచ్చాలు లేకుండా, ఒకరి మీద మరొకరు ప్రత్యేక అభిమానం కురిపిస్తూ మంచి స్నేహితులుగా మెలుగుతుంటారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అనే భేదం ఈ ఇద్దరి హీరోలలోనూ లేదు. వృత్తిపరమైన పోటీని సినిమాలకే పరిమితం చేసి నిజజీవితంలో ఎంతో ఎమోషనల్ బాండింగ్ కలిగి ఉంటారు చిరంజీవి, బాలకృష్ణ. గురువారం రాత్రి జరిగిన గీత రచయిత రామజోగయ్యశాస్త్రి ఇంట జరిగిన వివాహ వేడుకలో ఈ అనుబంధం మరోసారి ఆవిష్కృతమైంది. ఈ వేడుకకు చిరంజీవి, బాలకృష్ణ హాజరయ్యారు. చిరంజీవి ఎదురు పడగానే 'బ్రదర్.. ఎలా ఉన్నారు?' అని ఆప్యాయంగా పలకరించారు బాలకృష్ణ. ఇద్దరూ కాసేపు మాట్లాడుకున్న తర్వాత సెప్టెంబర్ ఒకటిన జరిగే తన సన్మాన కార్యక్రమానికి తప్పకుండా రావాలని చిరంజీవిని ఆహ్వానించారు. వస్తానని చిరంజీవి చెప్పారు. అలాగే 'అన్‌స్టాపబుల్' కార్యక్రమం గురించి కూడా వీరిద్దరి మధ్య సంభాషణ జరిగిందని సమాచారం.

కాలం కలిసొస్తే నడిచొచ్చే సినిమా



నాని హీరోగా నటించిన భారీ బడ్జెట్ చిత్రం 'సరిపోదా శనివారం' ఈ నెల 29న విడుదల కానుంది. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో నాని మాట్లాడుతూ 'ఈ సినిమా గురించి చాలా చెప్పేశాను. దర్శకుడు వివేక్ ఇందులో శివ తాండవం చూపించాడు. అతని కెరీర్‌కి ఈ సినిమా ఓ మైల్‌స్టోన్. మా కష్టాన్ని చూసి మీరు ఎంజాయ్ చేస్తారని భావిస్తున్నా. కాలం కలసి వస్తే నడిచి వచ్చే సినిమా వస్తుందంటారు. అటువంటి సినిమానే 'సరిపోదా శనివారం' అన్నారు. దర్శకుడు వివేక్ ఆత్రేయ మాట్లాడుతూ 'మా దర్శకుల కుటుంబం అంతా ఈ వేడుకకి వచ్చి ఆశీస్సులు అందజేశారు. ఈ సినిమా 29న విడుదల చేయడానికి దర్శకుల టీమ్ కూడా ఓ కారణం. నాని నా మీద ఉంచిన నమ్మకానికి 'సరిపోదా శనివారం' ఇచ్చా' అన్నారు. 'ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అవుతుంది. నాని కథల ఎంపికలో బెస్ట్. కథ నచ్చితే కొత్త దర్శకుడైనా అవకాశం ఇస్తారు. ఆయనతో సినిమా చేస్తే నిర్మాతకు ఏ టెన్షన్ ఉండదు' అన్నారు నిర్మాత దానయ్య. ఒక రకమైన యాక్షన్ ఫిల్మ్‌ను దర్శకుడు వివేక్ విభిన్నంగా మలిచారని ఎస్.జె.సూర్య ప్రశంసించారు.

ఇన్ ప్రోగ్రెస్

టైటిల్ సాంగ్ వచ్చేసింది



బిగ్‌బాస్ ఫేమ్ గౌతమ్‌కృష్ణ హీరోగా నవీన్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బాయ్'. సతీశ్ కుమార్ నిర్మిస్తున్నారు. శనివారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌గా టైటిల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ ఆకట్టుకుంటుంది. మంచి సబ్జెక్ట్‌తో తెరకెక్కుతోన్న ఈ మూవీలో చాలా ఆకట్టుకునే అంశాలు ఉన్నాయి" అని చెప్పారు.

మహిళలకు మాత్రమే



నూతన నటీనటులతో తెరకెక్కిన చిత్రం 'ఎంత పనిచేశావ్ చంటి'. ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని యూనిట్ నిర్వహించింది. దర్శకుడు నక్కిన త్రినాథరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుడు మాట్లాడుతూ 'విభిన్న కథతో 'ఎంత పనిచేశావ్ చంటి' చిత్రాన్ని తెరకెక్కించాం. ఈ సినిమాను మగవాళ్లు చూడకూడదు. మహిళలు మాత్రమే చూడాలి' అని అన్నారు. శ్రీనివాస్‌ఉలిశెట్టి, దియారాజ్, నిహారిక శాంతిప్రియ జంటగా నటించారు. సంగీతం: పవన్ సినిమాటోగ్రఫీ: సంతోష్.

పెద్ద హిట్టవ్వాలి



లక్షణమూర్తి రతన, భ్రమరాంబిక తూటిక ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'సీతారామ్ సిత్రాలు'. డి.నాగ శశిధర్ రెడ్డి దర్శకత్వంలో పి.పార్థసారథి, డి.నాగేంద్ర రెడ్డి, కృష్ణ చంద్ర విజయబట్టు నిర్మిస్తున్నారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆకాశ్ జగన్నాథ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్ మాట్లాడుతూ "ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

అందరూ ప్రశంసిస్తున్నారు



ఇటీవలే 'ఆయ్' సినిమాకు ఆకట్టుకునే సంగీతాన్ని అందించారు అజయ్ అరసాడ. ఈ సినిమా ఘన విజయం సాధించడంతో ఆయన మీడియాతో మాట్లాడారు. "నేను 'ఆయ్' చిత్రంలో సంగీతం అందించిన మూడు పాటలు అందరికీ విపరీతంగా నచ్చాయి. పాటలతో పాటు నేపథ్య సంగీతానికి విశేషాదరణ లభిస్తోంది. ఎంతో మంది మంచి సంగీతం ఇచ్చావని ప్రశంసిస్తున్నారు. ఓ సంగీత దర్శకుడిగా అన్ని జోనర్ సినిమాలు చేయాలనుంది. ప్రస్తుతం రెండు చిత్రాలకి సంగీతం అందిస్తున్నాను" అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



తమిళంలో విడుదలై ఘనవిజయం సాధించిన చిత్రం 'బంపర్'. ఇప్పుడు అదే పేరుతో తెలుగులోనూ రాబోతోంది. వెట్రి, శివాని నారాయణ్ ముఖ్య పాత్రలు పోషించారు. ఎమ్. సెల్వకుమార్ దర్శకత్వం వహించారు. శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు సెల్వకుమార్ మాట్లాడుతూ "ఓ లాటరీ నేపథ్యంలో సాగే థ్రిల్లర్ చిత్రమిది. ఇందులో వినోదంతో పాటు బోలెడు థ్రిల్లింగ్ అంశాలు ఉంటాయి" అని చెప్పారు.



సోషల్ మీడియా టు సినిమా

ఒకప్పుడు సినిమాల్లోకి రావాలంటే చాలా తతంగం ఉండేది. ఫొటోల ఆల్బమ్ చేత్తో పట్టుకుని ఆఫీసుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేది. ఫొటోలు నచ్చితే ఆడిషన్స్‌కు పిలుపు వచ్చేది. ఆడిషన్స్‌లో ఓకే అనిపించుకున్నా అవకాశం వస్తుందో రాదో తెలియని పరిస్థితి.. అయితే ఇప్పుడు ట్రెండ్ మారింది. ఆర్టిస్టులను ఎంపిక చేసే విధానమూ మారింది. సోషల్‌మీడియాలో కొంత హల్‌చల్ చేస్తే చాలు సినిమాల్లో అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేస్తున్నాయి. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ లే వేదికగా తమ టాలెంట్ ప్రదర్శించి, సినిమాల్లోకి ఎంట్రీ సంపాదించిన నటీమణులు కొందరున్నారు. వారెవరో ఇప్పుడు చూద్దాం.

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్‌లో డ్యాన్స్ రీళ్లతో అదరగొడుతూ లక్షలాది మందిని ఆకర్షించారు ఇమాన్ ఇస్మాయెల్ (ఇమాన్వీ). రీల్స్ చేయడమే కాకుండా ఆమె ఓ షార్ట్ ఫిల్మ్‌లోనూ నటించారు. యూట్యూబ్‌లో దాదాపు రెండు మిలియన్ల సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాలో దాదాపు తొమ్మిది లక్షల ఫాలోవర్లు ఆమెకు ఉన్నారు. దాంతో ఇప్పుడీ ఢిల్లీ భామ ఏకంగా ప్రభాస్ సరసన నటించే లక్కీ ఛాన్స్ పొందింది. తొలి సినిమానే పాన్ ఇండియా ఫిల్మ్ కావడం గ్రేట్ కదా! 1940ల నేపథ్యంలో హిస్టారికల్ డ్రామాగా ఈ సినిమాకు హను రాఘవపూడి దర్శకుడు.

గీతా ఆర్ట్స్‌లో..

యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో వీడియోలు, రీల్స్ ద్వారా ఫేమస్ అయిన మరో కంటెంట్ క్రియేటర్ నిహారిక ఎన్.ఎమ్. ఆమె కూడా నటిగా టాలీవుడ్‌లోనూ.. కోలీవుడ్‌లోనూ అడుగుపెట్టనున్నారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌లో అల్లు అరవింద్ నిర్మించే ఓ తెలుగు చిత్రంలో.. ఆకాశ్‌భాస్కర్ దర్శకత్వంలో అధర్వ హీరోగా ఓ తమిళ సినిమాలోనూ నటిస్తున్నారు. నిహారిక ఇటీవలే అమెరికన్ యానిమేటెడ్ కామెడీ టెలివిజన్ సిరీస్ 'బిగ్ మౌత్' సీజన్ 7లో ఓ క్యారెక్టర్‌కు వాయిస్ కూడా అందించడం విశేషం. పలు సామాజిక సమస్యలపై సోషల్ మీడియాలో అవగాహన వీడియోలు చేసే నిహారికకు యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లు.. ఇన్‌స్టాగ్రామ్ ఫాలోవర్లు మిలియన్లలో ఉన్నారు.

'బేబి' కాంబోలో..

సోషల్ మీడియాను తెలివిగా వాడుకుని సినిమాల్లో ఎంట్రీ కార్డ్ దక్కించుకున్న తెలుగమ్మాయి అలేఖ్య హారిక (దేత్తడి హారిక). యూట్యూబ్‌లో షార్ట్ ఫిల్మ్స్.. కవర్ సాంగ్స్.. వెబ్ సిరీస్‌లలో నటించి పాపులర్ అయ్యారు. ఆమె ప్రస్తుతం సంతోష్ శోభన్ హీరోగా సాయి రాజేశ్ దర్శకత్వంలో ఎస్.కే.ఎన్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు.



వరుసగా నాలుగో చిత్రం

సోషల్ మీడియాతో వరుస అవకాశాలు తెచ్చుకున్నారు కేరళకు చెందిన అనంతిక సనీల్‌కుమార్. కంటెంట్ క్రియేటర్‌గా ఓ వైపు రాణిస్తూనే.. క్లాసికల్ డ్యాన్సర్‌గా.. కరాటేలో బ్లాక్ బెల్ట్ హోల్డర్‌గా పలు రంగాల్లో పట్టు తెచ్చుకున్నారు. ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించారు. 'రాజమండ్రి రోజ్‌మిల్క్' చిత్రంతో తెరంగేట్రం చేసి.. 'మ్యాడ్' సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆమె ప్రస్తుతం 'మను' ఫేమ్ ఫణీంద్ర నార్సెట్టి దర్శకత్వం వహిస్తున్న 'ఎనిమిది వసంతాలు' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నారు.

వీళ్లతో పాటు సోషల్‌మీడియాను కేరాఫ్ అడ్రస్‌గా వాడుకుని ఇప్పటికే ఎంతో మంది తారలు సినిమాల్లో అవకాశాలు పట్టేశారు. వారిలో 'బేబీ' ఫేమ్ వైష్ణవి చైతన్య ఒకరు. షార్ట్ ఫిల్మ్స్.. సినిమాల్లో అతిథి పాత్రల్లో నటించిన ఆమె కెరీర్‌ను 'బేబీ' సినిమా సక్సెస్ ఒక్కసారిగా మార్చేసింది. వైష్ణవిని ఓవర్‌నైట్ స్టార్‌ను చేసి వరుస అవకాశాలు తెచ్చిపెట్టింది. మరో నాయిక రుహాని శర్మ కూడా సోషల్ మీడియా నుంచి వెండితెర ప్రయాణం చేసి 'ఇచ్చట వాహనాలు నిలుపరాదు' 'చి.ల.సౌ. స్రవంతి' చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. మోడల్‌గా ట్రయిల్స్ దశలో ఉన్న సాక్షి వైద్య సోషల్‌మీడియాలో తన ఫొటోల ద్వారా సినిమా అవకాశాలు దొరకబుచ్చుకున్నారు. అలా ఆమె 'ఏజెంట్' చిత్రంలో తళుక్కుమన్నారు. ఆ సినిమా సక్సెస్ కాకపోయినా.. ఈ అమ్మడుకు మాత్రం మరో రెండు క్రేజీ ప్రాజెక్ట్స్ లైన్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ కోవలోకి చెందిన వారే.. 'బీస్ట్' ఫేమ్ అపర్ణా దాస్, 'రొమాంటిక్', 'అంగరంగ వైభవంగా' ఫేమ్ కేతిక శర్మ, 'టాక్సీవాలా' ఫేమ్ ప్రియాంక జవాల్కర్. ఇలా ఎంతో మంది సోషల్ మీడియా స్టార్స్‌కు సినిమా తలుపులు తెరుస్తూనే ఉంది. మరి వీరిలో ఎంత మంది హీరోయిన్లుగా నిలబడతారో వేచి చూడాలి.





గదులు చాలక.. బోధన సాగక

● ప్రాక్టికల్స్ నిర్వహణకు తప్పని అవస్థలు ● ఇదీ ఇచ్ఛాపురంలోని బాలికల కళాశాలలో పరిస్థితి


ఇరుగ్గా ఉన్న గదిలో అభ్యసిస్తున్న బాలికలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సమస్యలు తిష్ఠ వేశాయి. ప్రధానంగా గదులు చాలకపోవడంతో బోధన సక్రమంగా సాగడం లేదు. బంగ్లారోడ్‌లో కొత్తగా కళాశాల భవనాన్ని నిర్మించారు. అక్కడ సరిపడ గదులు నిర్మించకపోవడంతో బాలికలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ప్రధానంగా ఒక గదిలో తరగతుల నిర్వహణతో పాటు సైన్స్ కోర్సుకు సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు. అదే గదిలో ప్రాక్టికల్ సామగ్రి ఉండడంతో తరగతుల నిర్వహణకు ఆటంకం కలుగుతోంది. గదుల కొరత వల్ల సైన్స్ ల్యాబ్‌లో ప్రాక్టికల్స్ నిర్వహించే సమయంలో బోధన నిలిపివేయాల్సి వస్తోంది. ఇక్కడ 430 మంది బాలికలు చదువుతున్నారు. ఇందులో సైన్స్‌కు సంబంధించి ప్రథమ సంవత్సరం 130 మంది, రెండో సంవత్సరం 140 మంది బాలికలు ఉన్నారు. మొత్తం 270 మందికి ఒకే గదిలో ప్రాక్టికల్స్ నిర్వహించడంతో సక్రమంగా ప్రాక్టికల్స్ జరగడం లేదని ద్వితీయ సంవత్సరం ఇంటర్ విద్యార్థినులు వాపోతున్నారు. ఇచ్ఛాపురం పట్టణం, గ్రామీణ ప్రాంత, ఒడిశాలోని తెలుగు విద్యార్థినులు ఇక్కడే ఇంటర్ చదువుతున్నారు. ఇక్కడ చేరే విద్యార్థినుల సంఖ్య పెరుగుతున్నా, వసతులు పెరగడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు.

నాలుగు గ్రూపులు.. ఆరు గదులు

ప్రస్తుతం ఇక్కడ ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ గ్రూపులు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం బోధనకు ఎనిమిది వరకూ గదులు అవసరం. ప్రాక్టికల్స్‌కు మరో నాలుగు గదులు ఉండాలి. అయితే ప్రస్తుతం ఆరు గదులు మాత్రమే ఉన్నాయి. ఇందులోనే కార్యాలయంతోపాటు ప్రిన్సిపాల్ విధులు నిర్వహించాల్సివస్తోంది. మరో ఏడు వరకు మొత్తం గదులు అవసరమని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం నిర్వహణ కళాశాలను ఇటీవలే నిర్మించారు. ఆ సమయంలో గ్రాంట్ పూర్తిస్థాయిలో విడుదలకాకపోవడంతో ఆరు గదులు మాత్రమే నిర్మించారు. ఇక్కడ వసతి సమస్యను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోవడంలేదని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తక్షణమే ఇంటర్ బోర్డు అధికారులు అదనపు గదులు నిర్మించి బోధన, ప్రాక్టికల్స్‌కు అవస్థలు తీర్చాలని పలువురు కోరుతున్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

● ప్రజలతో మమేకమై.. సమస్యలపై ఆరా

● సంతబొమ్మాళిలో మంత్రి అచ్చెన్నాయుడు పర్యటన


సంతబొమ్మాళి గ్రామస్థులతో మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని వ్యవసాయ,మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శనివారం సంతబొమ్మాళిలోని కొండవీధి, వెలమవీధి, దమ్మల వీధి, కంద్ర వీధి,మాదిగ వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కొండ వీధిలో వరదనీటితో ఇబ్బందిపడుతున్నామన్నామని స్థానికులు మంత్రికి వివరించారు. దీంతో కొత్త కాలువలకు అంచనాలు వేయాలని మండల ఇంజినీరింగ్‌ను ఆదేశించారు. వెలమవీధికి, దమ్మలవీధికి, మాదిగ వీధికి కొళాయిల ద్వారా నీరందేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రామకృష్ణను ఆదేశించారు. అనంతరం కంద్రకులస్థులు తమ వీధిలో కాలువలు, రోడ్డు, తాగు నీటి సమస్యను వివరించారు.ఈ సందర్భంగా మాదిగవీధి రచ్చబండ వద్ద అచ్చెన్నాయుడు మాట్లాడారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన సచివాలయాలు, ఆర్బీకే భవనాలు చుట్టూ ప్రహరి నిర్మించి మోడల్ కాంప్లెక్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. సంతబొమ్మాళిలో లేఅవుట్లు అభివృద్ధిచేసి ఇళ్ల స్థలాలు లేని ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామన్నారు. మాదిగ వీధికి కళావేదికతో పాటు శశ్మానానికి రహదారి ఏర్పాటు చేస్తామని తెలిపారు. తక్షణమే పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు సంతబొమ్మాళిలో ప్రజలతో మమేకమయ్యారు. తొలుత బుల్లెట్‌పై పలువీధుల్లో తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మెండ అప్పారావు, కాంతారావు,రెడ్డి అప్పన్న,కూశెట్టి భానుప్రకాష్ పాల్గొన్నారు.

కాలువలు లేక.. పూడిక తొలగించక

●టెక్కలిలో రోడ్లపైకి చేరిన మురుగు, వర్షం నీరు


సోగ్గాడిపేటలో రోడ్డుపైకి చేరిన మురుగునీరు

టెక్కలి: టెక్కలిలోని సోగ్గాడిపేట, మండాపోలం కాలనీ, పాతజాతీయ రహదారి మేదరవీధి తదితర ప్రాంతాల్లో అల్పపీడన ప్రభావంతో శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి రోడ్లపైకి వర్షపు, మురుగునీరు చేరింది. దీంతో స్థానికులు ఇళ్ల నుంచి బయటకు రావడానికి ఇబ్బందులుపడ్డారు. ప్రధానంగా వీధుల్లో కాలువలు సరిగ్గా లేకపోవడంతోపాటుపూడికలు తొలగించకపోవడంతో చిన్న వర్షం కురిస్తే మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని పలువురు వాపోతున్నారు. టెక్కలిలోని పలు వీధుల్లో డ్రైనేజ్ సౌకర్యం మెరుగుపరచాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నందిగాంలో వర్షం

నందిగాం: నందిగాం తదితర గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. కొద్దిరోజులుగా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు వర్షం ఊరటనిచ్చింది. వరిఎదలు, ఉభాలకు వర్షంతో మేలుజరుగుతుందని రైతులు తెలిపారు.

పీవీటీజీ పథకాలపై అవగాహన

నందిగాం: సొంటినూరు, జయపురంల్లో పీఎం జన్మన్-2 కార్యక్రమంలో భాగంగా గిరిజనులకు శనివారం పీవీటీజీ పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఎంపీడీవో టి.రాజారావు నేతృత్వంలో సర్పంచ్‌లు జీరు రాజేశ్వర నానీరెడ్డి, పినకాన జోగారావు అధ్యక్షతన సభలు నిర్వహించి గిరిజనులకు అమలు చేయనున్న పథకాలపై వివరించారు. గిరిజనులకు ఉపకారవేతనాలు, ప్రసూతి లబ్ధి, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర పీవీటీజీ పథకాల అమలుపై చర్చించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ ఎం.సింహాచలం, ఆర్ఐ కిరణ్, హౌసింగ్ ఏఈ దినేష్, పలు శాఖల సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలి


పెద్దదూగాంలో సర్వేను పరిశీలిస్తున్న సురేష్‌కుమార్

జలుమూరు: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో ఆశా కార్యకర్తలు మరింత బాధ్యతగా పనిచేయాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని చిన్నదూగాం, పెద్దదూగాంల్లో నిర్వహిస్తున్న ఎల్సీడీసీ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లో ప్రతి నెలా 25వ తేదీ నాటికి ఆశా ఆధారిత నివేదికలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సత్యవతి, పలువురు ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మెడికల్ పీజీ ప్రవేశ పరీక్షలో సత్తాచాటిన విద్యార్థి

●260వ ర్యాంక్ సాధించిన ఆకులసతివానిపేట వాసి


నవీన్

సంతబొమ్మాళి: మండలంలోని నరసాపురం పంచాయతీ పరిధిలోగల ఆకులసతివానిపేటకు చెందిన యర్నాగుల నవీన్ మెడికల్ పీజీ ప్రవేశపరీక్షలో సత్తాచాటాడు.ఈ మేరకు ఈ ఏడాది ఆలిండియాలో 260వ ర్యాంక్ సాధించాడు. విశాఖలోని ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేశాడు. నవీన్ తండ్రి శంకరరావు టెక్కలిలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు.ఈ మేరకు నవీన్‌ను గ్రామస్థులు అభినందించారు.

గ్రామసభలు విజయవంతం

కాశీబుగ్గ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీల ద్వారా నిర్వహించిన గ్రామసభలు విజయవంతమయ్యాయని పలాస జనసేన పార్టీ సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు తెలిపారు. శనివారం పలాసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సభల దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన పంచాయతీరాజ్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం పునర్జీవంపోయడానికి సమాయత్తమైందని చెప్పారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సారథ్యంలో పారదర్శక పాలన అందించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

నరసన్నపేట: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత సూచించారు. శనివారం పట్టణంలో డిగ్రీ కళాశాల విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

9 నుంచి ఎస్‌జీఎఫ్ ఎంపికలు

వజ్రపుకొత్తూరు: మండలంలో సెప్టెంబరు తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు గ్రిగ్స్, ఎస్‌జీఎఫ్ ఎంపికలు జరుగుతాయని ఎంఈవో బీవీ రమణ చెప్పారు. శనివారం వజ్రపుకొత్తూరు ఉన్నతపాఠశాలలో వివిధ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. 9న గోవిందపురం హైస్కూల్‌లో వాలీబాల్‌పోటీలు, 10న నగరంపల్లి హైస్కూల్‌లో ఖోఖో, షటిల్, టెన్నికాయిల్, 11న అక్కుపల్లిలో కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు జోనల్, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

27న కృష్ణాష్టమి వేడుకలు

టెక్కలి:శ్యామసుందరస్వామి ఆలయంలో ఈనెల 27న శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకులు పద్మనాభ పండా తెలిపారు. ఈ సందర్భంగా విశేష నక్షత్ర హారతులు, మేతి సప్తపూల కర్పూర హారతులు, ఊయల సేవ, తిరువీధి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మంత్రిని కలిసిన ఈవో

కోటబొమ్మాళి:నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును కొత్తమ్మతల్లి ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ శనివారం కలిశారు. ఈ సందర్భంగా అక్టోబరు ఒకటి నుంచి మూడు రోజులు జరిగే కొత్తమ్మతల్లి అమ్మవారి ఉత్సవాలపై మంత్రికి వివరించారు. త్వరలో ఆలయంలో గ్రామపెద్దలు, అధికారులతో ఉత్సవాలపై చర్చిస్తానని తెలిపారు.

మందస ఎస్ఐగా ఖాదర్‌భాషా

మందస: మందస ఎస్ఐగా ఖాదర్‌భాషా శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన డీపీటీసీ ట్రైనింగ్ సెంటర్ శ్రీకాకుళం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ బి.అనిల్‌కుమార్ సారవకోటకు బదిలీపై వెళ్లారు.

పోలాకి ఎస్ఐగా రంజిత్‌కుమార్

పోలాకి: పోలాకి పోలీస్ ఎస్ఐగా జి.రంజిత్ కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. పాడేరు నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు.ప్రస్తుతం పోలాకి ఎస్ఐగా విధులు నిర్వర్తించిన సత్యనారాయణ విశాఖపట్నం బదిలీపై వెళ్లారు.

హెచ్‌ఎంకు మెమో జారీ

కాశీబుగ్గ: కాశీబుగ్గ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చిన్నంనాయుడుకు విద్యాశాఖాధికారులు మెమోను జారీ చేశారు. కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ ఆలీఖాన్, టెక్కలి ఇన్‌చార్జి డిప్యూటీ విద్యాశాఖాధికారి విజయకుమారి, శ్రీకాకుళం బాలికల పాఠశాల హెచ్‌ఎం వాగ్దేవి పరిశీలించారు. ఆ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై అదే తరగతి చదువుతున్న ఓ విద్యార్థి వేధింపులకు గురి చేస్తున్నట్లు బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖాధికారి విచారణకు ఆదేశించారు. ఈ మేరకు వారు పాఠశాలను సందర్శించి విచారణ చేపట్టారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై హెచ్‌ఎం స్పందించలేదన్న విషయం తమ పరిశీలనలో తేలిందని అధికారులు తెలిపారు.డీఈవో ఆదేశాల మేరకు హెచ్‌ఎంకు స్పష్టమైన నివేదిక ఇవ్వాలని చార్జిమెమో జారీ చేశామని చెప్పారు. మళ్లీ మంగళవారం విచారణ నిర్వహిస్తామని తెలిపారు.

తీర గ్రామాల్లో జ్వరాలు

పోలాకి: గుప్పెడుపేట, కొత్తరేవు, గుల్లవానిపేట, రాజారాంపురంతదితర సాగరతీర గ్రామాల్లో జ్వరాలు ప్రబలుతున్నాయి. జ్వరాలు రోజులు తరబడి తగ్గకపోవడంతో పాటు నడుము, ఒళ్లంతా నొప్పి, వికారం వంటి లక్షణాలతో బాధపడుతున్నారు.ఈ నేపథ్యంలో పలువురు ప్రైవేటు వైద్యులను ఆశ్రయిస్తున్నారు.

రిజర్వాయర్లు ఆధునికీకరించాలి

● సీపీఎం నాయకుల డిమాండ్


కళింగదల్ రిజర్వాయర్ వద్ద మాట్లాడుతున్న గోవిందరావు

హరిపురం: కళింగదల్, డబార్సింగి, దామోదర సాగర్ తదితర రిజర్వాయర్లను ఆధునికీకరించాలని సీపీఎం నాయకులు డిమాండ్‌చేశారు. శనివారం మందస మండలంలోని పలు రిజర్వాయర్లను సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు ఆధ్వర్యంలో నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్లుగా సాగునీటి వనరులను వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విడిచిపెట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఏడు వేల ఎకరాల ఆయకట్టు ఉన్న కళింగదళ్ రిజర్వాయర్ కనీసం మూడు వేల ఎకరాలకు సాగునీందించలేని దుస్థితి నెలకొందని చెప్పారు. డబార్సింగి పూర్తిగా దెబ్బతిని సిమెంట్ కట్టడాలు కూలిపోయే పరిస్థితి నెలకొందని తెలిపారు. దామోదరసాగర్‌కు కాలువలు నిర్మించకపోవడంతో ఆయకట్టుకు నీరందడంలేదని చెప్పారు.ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రిజర్వాయర్లకోసం నిధులు మంజూరు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గసభ్యులు కె.మోహనరావు, తెప్పల అజయ్‌కుమార్, సంగారు లక్ష్మీనారాయణ, ఆర్.ఏకాశి, కె.కేశవరావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌పై అవగాహన కల్పించాలి

కోటబొమ్మాళి:కోటబొమ్మాళి జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబరు 14న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌పై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని జూనియర్ సివిల్ న్యాయాధికారి, మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షురాలు బీఎంఆర్ ప్రసన్నలత తెలిపారు. శనివారం కోటబొమ్మాళి కోర్టులో కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు తహసీల్దార్లు, మండలాభివృద్ధి అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో కోటబొమ్మాళి, జలుమూరు తహసీల్దార్లు ఆర్. అప్పలరాజు, జి.లక్ష్మీనారాయణ, సంతబొమ్మాళి డీటీ హరిబాబు, జలుమూరు ఎంపీడీవో పి.ఉమామహేశ్వరరావు, ఎస్సీటీ సబ్ ఇన్‌స్పెక్టర్ కుమార్ పాల్గొన్నారు.

నరసన్నపేటలో బ్యాంకు క్లర్క్ పరీక్షలు

నరసన్నపేట: నరసన్నపేటలోని కోర్‌టెక్నాలజీ కేంద్రంలో శనివారం బ్యాంకు క్లర్క్ పోస్టులకు పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరుజు నరసన్నపేటలో మూడు షిఫ్టుల్లో 180 మంది పరీక్షలు రాశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందు చేరుకొని రిపోర్టు చేయాలని బ్యాంకు రిక్రూట్‌మెంట్ అధికారులు చెప్పారు.

ఘనంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు


సామూహిక ఏకనామకీర్తన ఆలపిస్తున్న భక్తులు

పలాస: పలాసలోని సీతారామాలయంలో వెలసిన వెంకయ్యస్వామి ఆలయంలో అవధూత వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం సామూహిక అన్నదానకార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఓం నమోనారాయణ ఆదినారాయణ అన్న ఏకనామ సంకీర్తన పది గంటల పాటు నిర్వహించారు. మందిర ప్రధాన కార్యదర్శి గిన్ని జయశంకర్‌రెడ్డి, లలితారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

భుజంగరావుకు జాతీయ కవితా పురస్కారం

టెక్కలి: నందిగాం మండలంలోని బడగాం గ్రామానికి చెందిన కంచరాన భుజంగరావు రచించిన నీటిగింజలు పంట కవితా సంపుటి కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన యువ సాహితీ సేవా సంస్థ నిర్వహించిన పల్లా కవితా జాతీయ పురస్కారం-2024కు ఎంపికైనట్లు యువ సాహితీ సంస్థ ప్రకటించింది. సోమవారం పొద్దుటూరులో భుజంగరావుకు నగదు, జ్ఞాపికతో సత్కరించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. ఈ మేరకు భుజంగరావుకు పలువురు అభినందించారు.

28 వరకూ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

హిరమండలం: ఎటువంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 28 వరకు నిర్దేశించిన ఫీజుతో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు పొందవచ్చని ఎంఈవో కె.రాంబాబు చెప్పారు. శనివారం హిరమండలంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో నిలిచిపోయిన చదువులను ఓపెన్ స్కూల్ ద్వారా కొనసాగించుకోవచ్చని తెలిపారు.



హిరమండలంలో ఓపెన్ స్కూల్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

అంగన్‌వాడీలు సమయపాలన పాటించాలి


అంగన్‌వాడీ కేంద్రంలో పరిశీలిస్తున్న శాంతిప్రియ

పలాస రూరల్: అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని డీఎస్‌వో శాంతిప్రియ కార్యకర్తలను ఆదేశించారు. శనివారం మండలంలోని రెంటికోటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేశారు. ఇద్దరు కార్యకర్తల్లో ఒకరు హాజరుకాకపోవడంపై ఆయాలను ప్రశ్నించారు. కేంద్రానికి సరైన సమయంలో హాజరుకావాలని, పిల్లల హాజరు, పంపిణీ రికార్డులు నిర్వహించాలని కోరారు. శానిటేషన్, మౌలిక వసతులపై ఆరాతీశారు. అనంతరం స్థానిక రేషన్‌డిపోను పరిశీలించి బియ్యం తూకం పరిశీలించారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ ఎస్.రవికుమార్, వీఆర్వో సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

పైపులైన్ల లీకులు.. తాగు నీరు వృథా

● ఇదీ అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు పరిస్థితి

జలుమూరు: అచ్యుతాపురం తాగునీటి ప్రాజెక్టు పరిధిలో పలుచోట్ల పైపులైన్లు లీకులుకావడంతో నీరు వృథాగాపోతోంది. దీంతో పలు గ్రామాలకు తాగునీరందని పరిస్థితి నెలకొంది. ఈ ప్రాజెక్టు నుంచి మండలంలోని 40 గ్రామాలకు మొదటివిడతలో తాగు నీరందేలా చర్యలు తీసుకున్నారు. అయితే మొదటివిడతలో తాగు నీరందిస్తున్న చాలా గ్రామాలకు ఈ ప్రాజెక్టు నుంచి అందడం లేదు. కాని తాగునీరు అందుతున్న చల్లవానిపేట, లింగాలవలస కాలనీలు, జలుమూరు, కొమనాపల్లి తదితర గ్రామాల్లో పైపులైన్లు లీకులు కావడంతో తాగునీరు వృథాగా పోతోంది. హరికృష్ణమ్మపేట, దరివాడ, తదితర గ్రామాల్లో ట్యాపులు అమర్చక తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్లు లీకవడంతోపాటు ట్యాపులు లేకపోవడంతో తాగునీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


చల్లవానిపేటకాలనీలో పైపులైన్ లీకై వృథాగా పోతున్న తాగునీరు

మహిళకు పాముకాటు.. కాపాడిన పోలీసులు



108 అంబులెన్స్‌లో తీసుకువెళ్తున్న మహిళా పోలీసులు

గార: విధి నిర్వహణలో ఉన్న ఆ ఇద్దరు మహిళా పోలీసులు అర్ధరాత్రి వేళ పాము కాటుకు గురైన ఒక మహిళ ప్రాణాలు కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం రాత్రి 12.30 గంటల సమయంలో బందరువానిపేటకు చెందిన మహిళ ఓ పెళ్లిలో కూరగాయలు కోసి.. పని ముగించుకొని తిరిగి ఇంటికి నడిచి వెళ్తుండగా గార పోలీస్ స్టేషన్ సమీపంలో పాము కాటుకు గురైంది. నిస్సహాయ స్థితిలో ఉన్న ఆమెకు ఏమీ చేయాలో తెలియక దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ నైట్ డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ ఉషారాణి, మహిళా హోంగార్డు రాజ్యలక్ష్మిలకు జరిగిన విషయం చెప్పింది. దీంతో ఆమెకు మనోధైర్యం చెప్పి వెంటనే 108 వాహనానికి ఫోన్ చేసి రప్పించి చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి.. ఆమె ప్రాణాలు కాపాడారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి నైట్ డ్యూటీలో ఆ మహిళా పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు.

దాడిలో గాయపడిన యువకుడు మృతి

- వైసీపీ నేతల ఆందోళన.. ఫరీద్‌పేటలో ఉద్రిక్తత



నిరసన తెలుపుతున్న దృశ్యం



ప్రసాద్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైం: ఎచ్చెర్ల మండలం ఫరీద్‌పేట గ్రామంలో ఈ నెల 18వ తేదీ రాత్రి జరిగిన దాడిలో గాయపడిన కూన ప్రసాద్(25) విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల మేరకు.. 18వ తేదీ రాత్రి బైక్‌పై బహిర్భూమి కోసం వెళ్తున్న ప్రసాద్‌ను అప్పటికే మాటువేసి ఉన్న కొంతమంది దాడి చేశారు. దీంతో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను తొలుత శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. కేజీహెచ్‌లోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని స్వగ్రామానికి శనివారం సాయంత్రం తీసుకువచ్చి దహన సంస్కారాలు పూర్తి చేశారు. కాగా ప్రసాద్ మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నారన్న విషయం తెలుసుకుని వైసీపీ నేతలు అక్కడికి చేరుకుని ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, ఎంపీపీ చిరంజీవి, వైసీపీ నేతలు సనపల నారాయణరావుతో పాటు కుటుంబ సభ్యులు, బంధువులు కొయ్యిరాళ్ల జంక్షన్ వద్ద ఆందోళన చేపట్టారు. దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలని రోడ్డుపై బైఠాయించి వాహనం గ్రామంలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. పోలీసుల నచ్చజెప్పడంతో కాస్త శాంతించారు.

భారీగా పోలీసు పహారా

ఫరీద్‌పేట గ్రామంలో భారీగా పోలీసు పహారా కొనసాగుతోంది. గ్రామంలో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకోకుండా శనివారం ఉదయం నుంచే పోలీసు బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీలు శ్రీనివాసరావు, శేషాద్రి, సీఐలు అవతారం, ప్రసాద్, పైడపునాయుడు, ఇమ్మాన్యుయల్ రాజుతో పాటు ఏడుగురు ఎస్ఐలు, 75 మంది పోలీసు సిబ్బంది గ్రామంలో అల్లర్లు జరగకుండా పర్యవేక్షిస్తున్నారు. విద్యా కమిటీలు ఎన్నికలు జరిగినప్పటి నుంచి గ్రామంలో చిన్నచిన్న గొడవలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లీకైన గ్యాస్.. తప్పిన ప్రమాదం

టెక్కలి: రావివలస పంచాయతీ చిన్ననారాయణపురంలో శనివారం మధ్యాహ్నం గ్యాస్ లీకైన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. తొలుత ఓ ఇంట్లో గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. ఆ మంటలు ఇతర ఇళ్లకు వ్యాపిస్తుండడంతో యువకులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ ఘటనతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు.

వక్ఫ్ ఆస్తులను కాజేయడానికే చట్ట సవరణ



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

శ్రీకాకుళం కల్చరల్: వక్ఫ్ చట్ట సవరణ బిల్లు ముస్లిం మైనార్టీలను వక్ఫ్ బోర్డు నుంచి తొలగించేలా ఉందని, ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం మైనార్టీల వ్యతిరేక చర్యకు పూనుకుందని పలువురు అభిప్రాయపడ్డారు. నగరంలోని జామియా మసీదులో శనివారం వక్ఫ్ చట్ట సవరణ బిల్లు పై అఖిల పక్ష చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ముస్లిమేతరులను వక్ఫ్ కమిటీల్లో పెట్టాలని, వారికి కూడా హక్కులు కల్పించాలనడంలో కేంద్ర ప్రభుత్వ కపటత్వం బయట పడిందన్నారు. ముస్లిముల పై చిత్తశుద్ధి ఉంటే సచార్ కమిటీ నివేదిక, రంగనాథ్ మిశ్రా కమిషన్ సిఫారుసులపై పార్లమెంట్‌లో చర్చించాలని కోరారు. కార్యక్రమంలో మహిబుల్లాఖాన్, సురంగి మోహనరావు, రౌతు శంకరరావు, వీజీకే మూర్తి, భవిరి కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, గంజి ఆర్.ఎజ్రా, కంఠ వేణు, గణేష్, పిసిని చంద్రమోహన్, బాడాన దేవభూషణరావు, భాషా, మహబుల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బోధనను పరిశీలించిన కేంద్ర బృందం



విద్యార్థులతో కేంద్ర బృందం సభ్యులు

గార: దీపావళి యూపీ స్కూల్‌లో విద్యార్థులకు బోధనలో అమలు చేస్తున్న టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం)ను శనివారం కేంద్ర బృందం పరిశీలించారు. టీఎల్ఎం ద్వారా జరుగుతున్న బోధనపై బృందం సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. బృందం సభ్యులు సతీష్ షిండే జీగొల్ల, హెచ్ఎం జి.సూర్యనారాయణ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ప్రశాంత్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న దృశ్యం

పొందూరు: ఇటీవల అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి, జనసేన క్రియాశీలక సభ్యుడు హంస ప్రశాంత్ కుటుంబాన్ని శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల జనసేన పార్టీ అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ శనివారం పరామర్శించారు. పార్టీ పరంగా ప్రశాంత్ కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీ తరుపున ఇన్సూరెన్స్‌కు సంబంధించి రూ.5 లక్షలు త్వరలోనే అందిస్తామన్నారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె.చిన్నంనాయుడు, టీడీపీ అధ్యక్షుడు వై.రమణ, నాయకులు ఎం.హరనాథ్, సింహాద్రి, శివ తదితరులు ఉన్నారు.

రోడ్లపై పశువులు

- పాలు పిండుకుని వదిలేస్తున్న యజమానులు
- కమిషనర్ ఆదేశాలు బేఖాతరు
- వాహనాలకు అడ్డంగా వస్తూ.. ట్రాఫిక్ సమస్య
- ఇబ్బందిపడుతున్న శ్రీకాకుళం నగరవాసులు





డేఅండ్‌నైట్ జంక్షన్‌లో సంచరిస్తున్న పశువులు

(శ్రీకాకుళం అర్బన్)

పాలిచ్చే పశువుల నుంచి వచ్చే ఆదాయమే తప్ప వాటి సంరక్షణ బాధ్యతను యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో పశువులు నగర రోడ్లపై విచ్చలవిడిగా సంచరిస్తూ ట్రాఫిక్ సమస్యలతోపాటు దుర్గంధంగా మార్చేస్తున్నాయి. శ్రీకాకుళం నగరంలో వందల సంఖ్యలో ఉన్న పాలిచ్చే పశువులు ఎక్కడికక్కడ రోడ్లపై తిరుగుతున్నాయి. అర్ధరాత్రి భారీ వాహనాలు పశువులను ఢీకొని ప్రమాదాలు సంభవించడం, ప్రయాణికులకు గాయాలు కావడంతో పాటు పశువులు సైతం మరణిస్తున్నాయి. ఇక ద్విచక్ర వాహనాలపై వచ్చే యువత సంగతి అడగనక్కర్లేదు. కాగా రోడ్లపై పశువులను విడిచిపెడితే, వాటిని పట్టుకుని సీతంపేట అడవుల్లో వదిలేస్తామని ఇటీవల వాటి యజమానులను నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేసు హెచ్చరించారు. అయినా పశువులను పెంచే వారు పట్టించుకోకుండా రోడ్లపైకి విడిచిపెడుతుండడం విశేషం.

సీతంపేట అడవులకు తరలిస్తాం



పారిశుధ్య ఉద్యోగులతో మాట్లాడుతున్న ఎంహెచ్‌వో

శ్రీకాకుళం అర్బన్: నగరంలో పారిశుధ్యానికి ఆటంకం కలిగించేలా పశువులను, పందులను రోడ్లపైకి విడిచిపెడుతున్నారని ఇలా చేస్తే సీతంపేట అడవులకు తరలిస్తామని నగరపాలక హెల్త్ ఆఫీసర్ సుధీర్ కుమార్ స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శనివారం పారిశుధ్య ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించారు. రోడ్లపై పశువులను విడిచిపెట్టడంతో మలమూత్ర విసర్జన చేయడం వల్ల రోడ్లన్నీ పాడైపోతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పశువులు ఉన్నవారు వాటిని ఇంటి కట్టుకోవాలని లేకుంటే నగరానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పెంచుకోవాలే తప్పా ఇలా రోడ్లపైకి విడిచిపెడితే ఇకపై ఉపేక్షించేది లేదని, అడవుల్లో వదిలేస్తామి స్పష్టం చేశారు.

చర్యలు తీసుకుంటాం

పశువులను రోడ్లపై వదిలేయడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు గుర్తించాం. ఈ సమస్య పరిష్కా రంలో భాగంగా రోడ్లపై పశువులు దొరికితే సీతం పేట అడవుల్లో వదిలేస్తామని వాటి యజమానులను హెచ్చరించాం. ఇకపై ఉపేక్షించేది లేదు. రోడ్లపై పశువులు దొరికితే వాటిని తరలించేస్తాం.

- ఓబులేసు, నగరపాలక కమిషనర్

సన్‌సైన్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న సన్‌సైన్ స్కూల్ విద్యార్థులు

అరసవల్లి: స్థానిక జిల్లా పరిషత్ వద్ద గల సన్‌సైన్ స్కూల్‌లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలో ఉట్టి కొట్టి సందడి చేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ కె.ప్రదీప్ మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థులు మన సంప్రదాయాలను అలవరచుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, నీరజ, వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్లెటిక్ షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి: పేదలకు, సామాన్యులకు అందుబాటు ధరలలో ఉండి, నాణ్యతకు మారుపేరుగా నిలిచేది అక్లెటిక్ బంగారు కోటింగ్ గల వెండి సామగ్రి షోరూం అని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం నగరంలోని జీటీ రోడ్డులో ఆయన దేశంలోనే పేరుగాంచిన అక్లెటిక్ షోరూం బ్రాంచ్‌ను ప్రారంభించారు. తొలుత మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి జ్యోతి ప్రజ్వలన చేశారు. తొలి కొనుగోలుదారునిగా పేర్ల సాంబ మూర్తి వ్యవహరించారు. కార్యక్రమంలో అందవరపు ప్రసాద్, అందవరపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

గార: అందరూ సమన్వయంతో పనిచేయడం ద్వారా ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శివారు ప్రాంతాలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు బరాటం బాగ్యలక్ష్మి, అరవల శార్వాణి, ఎంపీడీవో ఎస్.రమణయ్య, తహసీల్దార్ ఎస్.రమణారావు, ప్రత్యేకాధికారి రమణమూర్తి, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రాము వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా డిజిటలైజేషన్

ఎచ్చెర్ల: రాష్ట్రంలోని యూనివర్సిటీలన్నీ డిజిటలైజేషన్ జరిగి, కచ్చితమైన డేటాబేస్ కలిగి ఉండాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్ అన్నారు. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని వర్సిటీల వీసీలతో వర్చువల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల సర్టిఫికేట్లు, మార్కుల జాబితాలన్నీ డిజిటల్ లాకర్‌లో పొందుపర్చాలన్నారు. స్కానింగ్, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేసి విద్యార్థి కేంద్రీకృతంగా సేవలు అందించాలన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ కె.రామ్మోహనరావు మాట్లాడుతూ.. అన్ని వర్సిటీలు డిజిటల్ విధానానికి తగిన సెక్యూరిటీని ముందుగానే చేపట్టాలన్నారు. బీఆర్ఏయూ వీసీ కేఆర్ రజని మాట్లాడుతూ.. ఈ వర్సిటీలో 2021లో ప్రారంభించిన డిజిటల్ లాకర్ సిస్టమ్‌ను ఇటీవల కాలంలో మరింత వేగవంతం చేస్తున్నామన్నారు. ఉన్నత విద్యామండలి వైస్ చైర్‌పర్సన్ పి.ఉమామహేశ్వరి, కార్యదర్శి నైనజీర్, బీఆర్ఏయూ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

కంచిలి: జ్వరాలు ప్రబలుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంఎస్ పల్లి పీహెచ్‌సీ వైద్యురాలు బి.హర్షిత అన్నారు. పద్మతుల పంచాయతీ అంపురం గ్రామానికి చెందిన గుజ్జు లక్ష్మికి డెంగ్యూ లక్షణాలు ఉన్నట్టు శ్రీకాకుళం జెమ్స్ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆ గ్రామంలో శనివారం ఇంటింటికీ వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. గ్రామంలో మెడికల్ క్యాంపు చేపట్టి యాంటీ లార్వ పిచకారీ చేశారు. డివిజనల్ మలేరియా అధికారి ఎస్. లక్ష్మీనారాయణ, ఎంపీహెచ్ఈవో వేణు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ఇచ్ఛాపురం: ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని గృహనిర్మాణ శాఖ ప్రత్యేకాధికారిణి శాంతిశ్రీ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్స్‌తో 100రోజుల ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. అనంతరం తులసీగాం గ్రామంలో లే ఔట్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఏవో రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోర్డును తొలగించారు..



బోర్డును తొలగించిన దృశ్యం

రణస్థలం: ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణ గోడపై రాసిన 'మా నమ్మకం నువ్వే జగన్.. మళ్లీ నువ్వే రావాలి' బోర్డును శనివారం తొలగించారు. 'ఇంకా వైసీపీపై అభిమానం పోనట్టుంది' శీర్షికతో శనివారం 'ఆంధ్రజ్యోతి'లో కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వీసీ తదితరులు

ఎచ్చెర్ల: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్- క్షేత్ర ప్రచార శాఖ (శ్రీకాకు ళం)తో కలిసి వర్సిటీలో శనివారం ఏక్ పేడ్ మా కే నామ్ పేరిట కార్యక్రమాన్ని ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలుష్యం రోజు రోజుకు పెరి గిపోతుందని, మొక్కలు విరివిగా పెంచడంతోనే పర్యావరణాన్ని రక్షించుకోగలమ న్నారు. సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్- క్షేత్ర ప్రచార ఉత్తరాంధ్ర జిల్లాల అధికారి బి.తారకప్రసాద్ మాట్లాడుతూ.. ఈ విషయంలో రాష్ట్రం ముందంజలో ఉందన్నా రు. రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ ఎం.అనూరాధ, జర్నలిజం అధ్యాపకులు ఆర్.తిరుపతిరావు, జి.లీలా ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. క్యాంపస్‌లోని ఇంజనీరింగ్ కళాశాల పరిసరాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

బీజేపీతోనే దేశం అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్

గుజరాతీపేట: దేశహితం కోసం, ప్రపంచ శాంతి కోసం నిరంతరం శ్రమిస్తున్న పార్టీ బీజేపీ అని విశాఖ నార్త్ ఎమ్మెల్యే పెన్మెత్స విష్ణుకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు హాల్‌లో శనివారం సాయంత్రం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యశాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా నూతనంగా సభ్యత్వ నమోదు చేపట్టనున్నట్టు తెలిపారు. జిల్లా ఇన్‌చార్జి విజయానంద రెడ్డి సభ్యత్వ నమోదు ఏ విధంగా చేసుకోవాలన్నది వివరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు, నాయకులు పూడి తిరుపతిరావు, పైడి వేణుగోపాలం, ఎస్.ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు, పి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల: కలకత్తా మెడికల్ కళాశాలలో ఇటీవల ట్రైనింగ్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారం కేసు లో నిందితులను కఠినంగా శిక్షించాలని మేమ్ సైతం స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి టీకే ఆచారి అన్నారు. దీనికి నిరసనగా శనివారం ధర్మవరంలో కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోలని, ప్రతిష్ఠమైన చట్టాలను అమలు చేయాలని నినాదాలు చేశారు.

అలంకరణలో బాల త్రిపుర సుందరి



గాజుల అలంకరణలో అమ్మవారు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాల త్రిపుర సుందరి దేవి అమ్మవారిని శనివారం ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నక్షత్ర హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి సహస్ర గాజులుతో అలంకరణ నిర్వహించారు.

బూర్జపాడు కాజ్‌వే పైకి వరద నీరు



ఇచ్ఛాపురం: ఇటీవల ఆంధ్రాతో పాటు ఒడిశాలో కురిసిన భారీ వర్షాలకు బాహుదా నదికి వరద నీరు వచ్చి చేరింది. దీంతో సాగర తీర ప్రాంతమైన బూర్జపాడు కాజ్‌వే పైకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడ్డారు. పెద్దలక్ష్మీ పురం, చిన్న లక్ష్మీపురం, శివకృష్ణాపురం, డొంకూరు తదితర ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

నిబంధనలు పాటించాలి

శ్రీకాకుళం క్రైం: నార్కోడ్రగ్స్, సైకోట్రాపిక్ సబ్‌స్టాన్స్‌స్ కేసుల దర్యాప్తులో నిబంధనలు పాటించాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శనివారం పోలీసు అధికారులకు నార్కోడ్రగ్స్, సైబర్ కేసుల దర్యాప్తు, నూతన చట్టాలపై రిటైర్డు ఏఈపీప (ఏసీబీ కోర్టు విశాఖ) కె.రామకృష్ణతో అవగాహన కల్పించారు. గంజాయి, మాదకద్రవ్యాలు, సైకోట్రోపిక్ వంటి కేసుల్లో నిబంధనలు పాటించాలన్నారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్, పోలీస్ లీగల్ అడ్వయిజర్ యామిని రాణి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

బూర్జ ఎస్ఐగా ప్రవల్లిక



బూర్జ: బూర్జ ఎస్ఐగా ఎం.ప్రవల్లిక శనివారం బాధ్యతలు చేపట్టారు. స్టేషన్ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎస్ఐ ప్రవల్లిక మాట్లాడుతూ.. మాద కద్రవ్యాల రవాణాకు అడ్డకట్ట వేదయంతోపాటు వాహనాల తనిఖీ, మహిళల భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్టు తెలిపారు. చట్టవ్యతిరేరంగా ఉంటే చర్యలు తప్పన్నారు.

లావేరు ఎస్ఐగా లక్ష్మణరావు



లావేరు: లావేరు ఎస్ఐగా జి.లక్ష్మణరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధులు, యువత అందరి సహ కారంతో మండలంలో శాంతి భద్రతలు పరిరక్షణ కు కృషి చేస్తానన్నారు. చట్టాన్ని అతిక్రమించేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. చేస్తానని తెలిపారు.

జేఆర్ పురం ఎస్ఐగా చిరంజీవి

రణస్థలం: జేఆర్ పురం ఎస్ఐగా చిరంజీవి శనివారం బాధ్యతులు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన కే.గోవిందరావు వీఆర్‌లో ఉన్నారు. ఎచ్చెర్ల ఎస్ఐగా విధులు నిర్వహించిన చిరంజీవి బదిలీపై జేఆర్ పురం వచ్చారు. అందరి సహకారంతో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూస్తానన్నారు.

రూరల్ ఎస్ఐగా శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐగా శ్రీనివాసరావు శనివారం బాధ్యలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ లక్ష్మణరావుకు విశాఖ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

27న ఆదిత్యుని హుండీల లెక్కింపు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీలను ఈ నెల 27న లెక్కించనున్నట్టు ఈవో ఎస్.చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేవదాయశాఖ సిబ్బంది, అనువంశిక ధర్మకర్త, పాలకమండలి సభ్యులు, అర్చకులు, భక్తులు, గ్రామపెద్దల సమక్షంలో లెక్కింపు చేపట్టనుననట్టు తెలిపారు.

ఆర్టీసీలో డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

అరసవల్లి: ఏపీఎస్ ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 17వ బ్యాచ్ శిక్షణకు లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించి బ్యాచ్‌కు 16 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 7382923293, 7095040608, 7382924758 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బాధ్యతలు చేపట్టిన కమిషనర్



కమిషనర్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఆమదాలవలస: స్థానిక మున్సిపాలిటీ కమిషనర్‌గా పూజారి బాలాజీ ప్రసాద్ శనివారం బాధ్యతలు చేపట్టారు. నెల్లిమర్ల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయనకు ఏఈ కె.అప్పలాయుడు, హెచ్‌వీ సత్యనారాయణ, సాయిరాం, ఆర్ఐ ఎం.రామారావు, మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా తాడిపత్రి నుంచి ఆమదాలవలస మున్సిపల్ కమిషనర్‌గా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వహించిన జి.రవి తిరిగి బదిలీపై వెళ్లారు. నూతన కమిషనర్ బాలాజీ ప్రసాద్ మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించి పట్టణవాసులకు మెరుగైన సేవలు అందిస్తానన్నారు.

నైట్ హాల్ట్ బస్సు నడపాలి

గార: బూరవెల్లి రూటులో గతంలో నడిపే నైట్ హాల్ట్ బస్సును తిరిగి నడపాలని ఈ రూటులో ప్రయాణికులు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. ఈ రూట్ నైట్ హాల్ట్ బస్సును గతంలో రద్దు చేయడం వల్ల దూరప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, పిల్లలు చాలా ఇబ్బంది పడాల్సివస్తోంది. సాయంత్రం తర్వాత ఈ రూటులో బస్సు అందుబాటులో లేకపోవటం వల్ల ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తుంది. అందువల్ల నైట్ హాల్ట్ బస్‌ను తిరిగి నడపాలని, ఇందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవ తీసుకోవాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ బస్ తిరిగి నడపటం వల్ల సింగుపురం, బైరి, బూరవెల్లి, పూసర్లపాడు, శాలిహుండం తదితర 25 గ్రామాల ఉపయోగం అన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

రణస్థలం: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం నదుకుదిటిపాలెం రానున్నారని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మినహాయింపుపై హర్షం

అరసవల్లి: మార్చి 31, 2025 లోపు పదవీ విరమణ చేయబోయే ఉద్యోగులందరికీ ప్రస్తుత సాధారణ బదిలీల నుంచి మినహాయింపు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మినహాయింపు పట్ల ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు సాయిరాం, చల్లా వెంకటేశ్వరరావులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 17న ప్రభుత్వం జారీ చేసిన జీవో 75 ఉత్తర్వుల్లో సంవత్సరం లోపు పదవీ విరమణ కానున్న ఉద్యోగులకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కెవి.శివారెడ్డి, చౌదరి పురుషోత్తంనాయుడు ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. వీంతో ప్రభుత్వం వారికి మినహాయింపు కల్పించింది.

క్రీడలను ప్రోత్సహించాలి

పొందూరు: పాఠశాలస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడం ద్వారా నాణ్యమైన క్రీడాకారులను తయారు చేయడానికి గ్రిగ్స్ పోటీలు ఉపకరిస్తాయని మండల విద్యాశాఖాధికారి పి.రాజారావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో వ్యాయామ ఉపాధ్యాయులతో గ్రిగ్స్ పోటీలపై సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 10న మండల క్రీడా కార్యదర్శి కింతలి పీడీ ఆధ్వర్యంలో కబడ్డీ, వాలీబాల్, 11న ఖోఖో, టెన్నీకాయిట్, 12న బాట్మింటన్ పోటీలు ఉంటాయన్నారు.

సరుబుజ్జిలిలో భారీ వర్షం



సరుబుజ్జిలి: మండలంలోని పలు ప్రాంతాలతో పాటు మండల కేంద్రమైన సరుబుజ్జిలిలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి వాతావరణంలో తీవ్రమైన మార్పు రావడంతో పాటు చిన్నపాటి చిరుజల్లులు కురుస్తూ మధ్యాహ్నం సమయంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంలోని రహదారులన్నీ జలమయం అయ్యాయి. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న కల్వర్టును అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు ప్రయోజనం

పొందూరు: సహితవిద్యతో దివాంగులకు ప్రయోజనాలు కలుగుతున్నాయని సహితవిద్య జిల్లా కో-ఆర్డినేటర్ బి. గోవిందరావు అన్నారు.. పొందూరు మండలంలో శనివారం సందర్శించారు. అచ్చిపోలవలస గ్రామంలో బి. మహేష్ అనే దివ్యాంగ విద్యార్థికి వీల్‌ఛైర్ అందించారు. తల్లిదండ్రులు తమ దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఐఈఆర్‌టీ దినేష్ ఉన్నారు.

ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: కేదారిపురం గ్రామానికి చెందిన ఆశి దుర్యోధన ఇటీవల జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఇతడి ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన గల్ఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు ఒక్కో కుమార్తెపై రూ20వేలు చొప్పున రూ60వేలు పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి బాండ్లు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.